

అల్లూరి సీతారామరాజు

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

- ఘనంగా జన విజ్ఞానవేదిక జిల్లా మహాసభలు

ప్రజాశక్తి పాడేరు మండలంలోని తలారిసింగిలో అల్లూరి జిల్లా జనవిజ్ఞాన వేదిక మహాసభలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాడేరు మండల విద్యాశాఖాధికారి ఎం. జాన్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని, మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన, చైతన్యం కలిగి ఉండాలన్నారు.. జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడ నమ్మకాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా కెవి రామేశ్వరం, ప్రధాన కార్యదర్శిగా యండమూరి పారయ్య, కోశాధికారిగా పి .లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమం లో అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యం.శేషాద్రి, పభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ప్రతి నియోజకవర్గంలోనూ

అరకు కాఫీ షాప్

అందుబాటులో గిరి ఉత్పత్తులు : మంత్రి గుమ్మడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అరకు కాఫీ షాప్‌లు పెట్టాలని, ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని జిసిసి అధికారులను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే పార్లమెంటు, అసెంబ్లీల్లో పెట్టిన కేంద్రాలను కొనసాగించాలని, మరింత సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఆమె బీచ్ రోడ్డులోని జిసిసి కార్యాలయ సమావేశ మందిరంలో ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎమ్‌డి కల్పనా కుమారి, డైరెక్టర్లు నాగరాజు, కనకరాజు, నిబ్రహీం, తదితర అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అరకు కాఫీ ఉత్పత్తుల అమ్మకాలు, దుకాణాల నిర్వహణ, గిరిజన రైతుల సంక్షేమం, బెరి బొర పురుగు వ్యాప్తి తదితర అంశాలపై సమీక్షించారు. భవిష్యత్తు కార్యాచరణపై డైరెక్టర్లు, ఇతర అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరకు కాఫీ విషయంలో ప్రత్యేక కార్యాచరణతో లాభదాయక చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అధికారులు గిరిజన రైతులతో మమేకం కావాలన్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని, కాఫీ సాగులో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా హితవు పలికారు. జిసిసి కార్యకలాపాలపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. సమీక్షలో భాగంగా పలు అంశాలపై చర్చించిన ఆమె జిసిసిలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, కొత్త నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయాల ద్వారా సర్దుబాటు చేసే సిబ్బందిని తాత్కాలికంగా వినియోగించుకోవాలని ఎమ్‌డికి సూచించారు. జిసిసి ప్రాంగణంలో రూ.84 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. గతంలోనే ప్రపోజల్స్ రూపొందించామని, ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెప్పగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి మరొకసారి తీసుకెళ్తానని మంత్రి పేర్కొన్నారు.

కాఫీ రైతులను ఆదుకోవాలి

- బెర్రీ బోరర్ కీటక తెగులుతో తోటలకు తీవ్రనష్టం
- ఎకరాకు రూ.లక్ష పంట నష్ట పరిహారం చెల్లించాలి
- పచ్చి కాఫీ పండ్లు కిలో రూ.200కు కొనుగోలు చేయాలి
- నష్టాలను పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



పురుగులు పట్టిన కాఫీని పరిశీలిస్తున్న అప్పలనర్స, సిపిఎం బృందం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: బెర్రీ బోరర్ కీటక తెగులు వ్యాప్తితో కాఫీ పంటను తీవ్రంగా నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. వైరస్ వ్యాప్తిపై సమగ్ర పరిశీలన జరిపి, పంటనష్టపోయిన కాఫీ రైతులకు ఎకరానికి రూ.లక్ష పరిహారం చెల్లించి ఆదుకోవాలని, పచ్చి కాఫీ పండ్లు కిలో రూ. 200 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స ఆధ్వర్యంలో సిపిఎం బృందం చినలబుడు పంచాయితీ పక్కనకుడి గ్రామాన్ని సందర్శించి, బెర్రీ బొరర్ వైరస్ సోకిన కాఫీ తోటలను పరిశీలించారు. పంటనష్టాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు కాఫీ పండ్లు కిలో రూ.50లకు కొనుగోలు చేయడంతో గిట్టుబాటు కావడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో బెర్రీబోరర్ పురుగు దెబ్బకు పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం అప్పలనర్స మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన అరకు ఆర్గానిక్ కాఫీని బెర్రీ బోరర్ పురుగులు తీవ్రంగా నాశనం చేసిందన్నారు.2016లో స్వచ్ఛందసంస్థల ద్వారా కాఫీ మొక్కలు పొందిన రైతుల తోటలోనే ఈ వైరస్ సోకిందని, పక్కనకుడి గ్రామంలో ఇప్పటికే 80 ఎకరాల కాఫీ తోటలు వైరస్ బారిన పడి పాడయ్యాయన్నారు..కర్ణాటక ప్రాంతంలో ఉండే ఈ వైరస్ అల్లూరిజిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో వ్యాప్తి చెందడానికి కారణాలపై సమగ్ర పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి, కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ కీటకాలను నివారించకుంటే, ఏజెన్సీలో సుమారు రెండు లక్షల ఎకరాల కాఫీ తోటలు నాశనమౌతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీలతో కాఫీ వ్యాపారం చేయరాదని, పోటీ పేరుతో ఏజెన్సీ కాఫీ రైతులను ఫణంగా పెట్టొద్దన్నారు. కాఫీ తోటల్లో వైరస్ ప్రభావం ఐదేళ్ల వరకు ఉండే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో, పంట నష్టపోయిన కాఫీ రైతలకు ఎకరానికి ఏడాదికి రూ.లక్ష పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. వైరస్ బారిన పడిన తోటల్లో పనిచేస్తున్న కాఫీ కార్మికులకు నగదు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు,ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్, ఆదివాసి గిరిజన నాయకులు టి కృష్ణారావు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

ప్రజాశక్తి-అనంతగిరి :పౌష్టికాహారం అమలు, రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి. కాంతారావు హెచ్చరించారు. మంగళవారం అనంతగిరి మండలంలో సుడిగాలి పర్యటించారు . పెద్దూరు మండల పరిషత్ పాఠశాలలో సందర్శనలో మెనూ అమలులో 130 గుడ్లు తక్కువగా ఉండడంతో పాఠశాల హెచ్‌ఎం కుమారికి ఆదేశించారు. బొర్రా రేషన్ డిపో తనిఖీ చేయగా 14 బస్తాలు, అలాగే పంచదార నిల్వలు తక్కువగా ఉండడంతో సేల్స్‌మ్యాన్‌కు మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే బాలికల పాఠశాల 2ను సందర్శించి, చారు. అక్కడ పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు.అక్కడ అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడిరేషన్ డిపోను తనిఖీ చేశారు. బొర్రా నిన్నిమామిడి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పౌష్టికాహారం, రేషన్ పంపిణీల్లో పలుచోట్ల అవకతవకలు తన దృష్టికి వచ్చాయని, వాటిపై తగు చర్యలకు అధికారులను ఆదేశించామన్నారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ఝాన్సీభాయి, డిఎస్ఒ పి. మోహన్‌బాబు. సిఎస్‌డిటి. ప్రశాంత్ కుమార్. ఫుడ్ సేఫ్టీ అధికారిణి .గ్రీష్మ, ఎంపిడిఒ ప్రభాకరరావు. తహసిల్దార్ వీరభద్రాచారి. ఎటిడబ్ల్యూఒ కిల్లో. వెంకటరమణ. ఎంఇఒ 2 నాగేశ్వరరావు, సిడిపిఒ సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు

వేతన పెంపునకు ఐక్య ఉద్యమం

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ



అంగన్వాడీల జిల్లా మహాసభలో మాట్లాడుతున్న పద్మ

ప్రజాశక్తి- పాడేరు : రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్ల వేతనాలను తక్షణమే పెంచాలని లేనిపక్షంలో ఉద్యమం తప్పదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం పాడేరు మోదకొండమ్మ గుడి వద్ద యూనియన్ జిల్లా ద్వితీయ మహాసభ నిర్వహించారు యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, చిన్నారి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో పద్మ మాట్లాడుతూ అంగన్వాడీలకు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 42 రోజుల అంగన్వాడీల సమ్మె చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావడం అంగన్వాడీలు పోరాట విజయమని, అయితే అప్పట్లో చేసిన ఒప్పందాల అమలుకు ఉద్యమించాల్సి రావడం విచారకరమన్నారు.

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి మూడేళ్ల కార్యదర్శి నివేదికప్రవేశపెట్టారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎఫ్ఐ పోతురాజు, సహాయకార్యదర్శి, శంకర్రావు, విశాఖపట్నం అంగన్వాడీ యూనియన్ నాయకులు శోభ, జిల్లా 11 మండలాల ప్రాజెక్ట్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలి

- కీళ్లనొప్పుల బాధితులు ఆందోళన చెందవద్దు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్
- 'ప్రజాశక్తి 'వార్తకు స్పందన



బాధితుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: లాగరాయి పిహెచ్‌సి పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం అధికారులను ఆదేశించారు. 'వింత వ్యాధితోవిలవిల' అనే కథనం ప్రజాశక్తి పత్రికలో వెలువడిన నేపథ్యంలో అధికారులు స్పందించి వైద్యశిబిరాలు నిర్వహణ, పారిశుధ్య చర్యలు చేపట్టిన సంగతి విదితమే. మెడికల్ క్యాంపులను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు.ప్రజలకు అవగాహన కల్పించి ధైర్యం చెప్పాలని డిఎంహెచ్ఒ విశ్వేశ్వరనాయుడు, ఎడిఎం హెచ్ఒ డేవిడ్, డాక్టర్ శిరీషలను ఆదేశించారు. లాగరాయి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. లాగరాయి పంచాయతీలో పారిశుధ్యం లోపించిందని, తాను మళ్లీ వచ్చేసరికి ఇలాగే ఉంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆయన బాధితులతో మాట్లాడుతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైరల్‌ఫీవర్, చికున్‌గున్యా వల్లనే కీళ్లనొప్పులు వాపులు వస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ దినేష్ కుమార్ కాకినాడ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఆసుపత్రిలో వ్యాధులు నిర్ధారించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దోమల మందు పిచికారి చేయించాలన్నారు. లాగరాయి పిహెచ్‌సిలో గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీసారు. ఇంద్ర గ్రామంలో మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు అదనపు తరగతి ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వల్, డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గణలక్ష్మి, ఎఎంసి చైర్మన్ ఎల్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కిర్రాబు ఆనకట్ట నిర్మించాలి : ఆదివాసీ జెఎసి వినతి

మండలంలోని కిర్రాబు రిజర్వాయర్‌పై ఆనకట్ట నిర్మించి రైతులను ఆదుకోవాలని ఆదివాసీ జెఎసి నేతలు వంతు బాలకృష్ణ, గంపా నాగరాజు, తాము సూరిబాబు, వజ్రపు అప్పారావు తదితరులు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. మండలంలోని లాగరాయి గ్రామంలో కలెక్టర్‌ను ఆదివాసీ జెఎసి నేతలు కలిసి సమస్యలు విన్నవించారు. డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు ఆదివాసీలతో భర్తీచేసే విధంగా చట్టం చేయాలని కలెక్టర్‌ని కోరారు. కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని గత 20 సంవత్సరాలుగా పోరాటం చేసినా సమస్యను పరిష్కారం కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ ఇచ్చారు ఆదివాసీ జెఎసి నాయకులు గోకిరి గంగరాజు, పామి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న జెఎసి నేతలు


యూరియా కోసం అన్నదాతల అవస్థలు



రైతు సేవా కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం మండలం ధారకొండలో యూరియా కోసం మూడు పంచాయతీల గిరిజన రైతులు పడికాపులు పడ్డారు. అయినా పంపిణీ కాకపోవడంతో రైతుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. జికె వీధి మండలానికి 20,067 యూరియా బస్తాలు ప్రభుత్వం పంపించింది. మండల కేంద్రంలో రైతులకి 90 బస్తాలు సరఫరా చేశారు. మిగతా 177 బస్తాలు ధారకొండ రైతుసేవా కేంద్రానికి తరలించారు. యూరియా పంపిణీ చేస్తారనే సమాచారం అందడంతో దుప్పిలివాడ, ధారకొండ, గుమ్మరేవులు మూడు పంచాయతీల గిరిరైతులు రైతుసేవా కేంద్రానికి ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. గంటల తరబడి మండుటెండలో నిరీక్షించారు. మధ్యాహ్నం రెండు గంటలకు వ్యవసాయాధికారి గిరిబాబు వచ్చి సర్పంచ్ రాజు సమక్షంలో యూరియా పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు.

ప్రస్తుతం ఉన్న 177 యూరియా బస్తాలు ఎంతమందికి అయితే అంతమందికి పంపిణీ చేస్తామన్నా రు. మరొక 20 రోజుల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారి చెప్పడంతో రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. 750 మందిమి వచ్చామని ఎంతమందికి సర్దుబాటు చేస్తారని ఆందోళన చేశారు. దీంతో ఎస్సై రవీంద్ర రైతులకు నచ్చజెప్పారు. మూడు పంచాయతీలకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేయడంతో వ్యవసాయాధికారి వెను తిరిగారు. ప్రభుత్వ అధికారులు స్పందించి సకాలంలో యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



సమస్యలను వివరిస్తున్న పీసా కార్యదర్శి

రింతాడ 2లో 'ఆదికర్మ యోజన '

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలో దుచ్చరపాలెం, ఏబులం ఈ రెండు గ్రామాలు ఆదికర్మ యోజన కార్యక్రమంలో ఎంపికయ్యాయి. మడపాల సోమేష్‌కుమార్ కార్యదర్శి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల పీసా కార్యదర్శి గబులంగి గణేష్ మాట్లాడుతూ ఏబులం గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని ప్రధానంగా డ్రైనేజ్ మినీ అంగన్‌వాడి, పంట కాలువ, కమ్యూనిటీ హాల్, మినీ గ్రంథాలయం కావాలని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మార్కెట్ చైర్మన్ మొట్టడం శరబన్నదొర వంద్రంగి సత్యనారాయణ, సాగిన జోగిపడల్, జనసేన నాయకులు సాగిన బ్రహ్మాజీపడాల్, పీసా అధ్యక్షులు సాగిన భీమేష్ పడాల్, స్కూల్‌చైర్మన్ రమేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గోకిరి రామకృష్ణ మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన ప్రస్తుతం బూదరాళ్ల ఎంపిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గోకిరి రామకృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండలంలో పలువురు ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎంఇఒలు రాంబాబు, ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేంద్రపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి -చింతూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ వైసిపి చేపట్టిన చంద్రబాబు ష్యూరిటి -మోసం గ్యారెంటీ కార్యక్రమంలో రంపచోడవరం నియోజవర్గం చింతూరు (ఎర్రంపేట) మండలస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో ప్రజలను మోసం చేసిందని అందుకే ప్రజల తరపున తమ పార్టీ తరపున పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చింతూరు మండల పార్టీ అధ్యక్షులు, విఆర్‌పురం మండల పార్టీ అధ్యక్షులు, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు, చింతూరు జెడ్పిటిసి , ఎంపిపి, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు


ప్రజాశక్తి-జికెవీధి: మండలంలో మొండిగెడ్డ పంచాయితీ గింజంగి జెడ్‌పి నిధులతో 90 మీటర్ల సిసి రోడ్ నిర్మాణానికి సర్పంచ్ అడప ప్రియాంక ఎంపిపి బోయినకుమారి ప్రారంభించారు. గ్రామస్థులు, జెడ్‌పిటిసి మత్స్యరాస శివరత్నం కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపెద్దలు జర్తబాలన్న, వైసిపి నాయకులు , కూటమి నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు

ప్రజాశక్తి-సీలేరు: ఆర్టీసీ అధికారులు మన్యంలో డొక్కు బస్సులు తిప్పడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే అల్ట్రాడీలక్స్ బస్సు విశాఖ కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం ఐదు గంటలకు బయలుదేరి నర్సీపట్నం వయా సీలేరు చింతూరు మీదుగా భద్రాచలం సాయంత్రం 6 గంటలకు చేరాల్సి ఉంది. మధ్యాహ్నం సీలేరు చేరుకునేసరికి బస్సులో సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయింది. డ్రైవర్ పరిశీలించి సాంకేతికలోపం వల్ల స్టీరింగ్ పట్టేసిందని బస్సు కదలని పరిస్థితి ఉందని గుర్తించారు. ఆర్టిసి అధికారులకు సమాచారం అందించారు. నర్సీపట్నం వయా చింతపల్లి మీదగా సీలేరు సాయంత్రం మూడు గంటలకి వచ్చే బస్‌లో ప్రయాణికులను భద్రాచలం తరలించాలని ఆదేశించారు. దీంతో ప్రయాణికులకు ఆ బస్సు ఎక్కించి భద్రాచలం చేర్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండిషన్ కలిగిన బస్సులనే నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భారీ వర్షానికి కొట్టుకుపోయిన పాతపాడి-రత్నంపేట వంతెన

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలో కొండగోకిరి పంచాయతీలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పాతపాడి రత్నంపేట గ్రామాల మధ్యనున్న కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షానికి వంతెన కొట్టుకు పోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కొయ్యూ రు సిఐ శ్రీనివాసరావు ప్రమాదాలు జరగకుండా రహదారి నిర్బంధించారు. వాగులోకి ఎవరు దిగకుండా పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచారు.



కొట్టుకుపోయిన వంతెన

రహదారి సమస్య పరిష్కారానికి కదలిరండి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజ వొమ్మంగి: ఏలేశ్వరం నుండి గొంటివానిపాలెం, జె అన్నవరం వరకూ రహదారి నిర్మాణ సమస్య పరిష్కారం కోసం ఏజెన్సీ వాసులు కదలి రావాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మంగళవారం పిలుపునిచ్చారు. రహదారి సమస్య పరిష్కారం కోసం ఈ నెల 12న రాస్తారోకో, ఆందోళన చేపట్టనున్న నేపథ్యంలో కార్యక్రమానికి అధిక సంఖ్యలో గిరిజన వాసులు తరలి రావాలని లోతా రామారావు పిలునిచ్చారు. కార్య క్రమంలో ఎంపిటిసి కోసూరి చిన్నాలమ్మ, గ్రామ స్తులు చిన్న జయ బాబు, చవల చిన్ని బాబు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న లోతా రామారావు

అనాథ చిన్నారులను ఆదుకోవాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిరంజీవి

ప్రజాశక్తి-చింతపల్లి : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గెరిల్గడ్డ గ్రామానికి చెందిన కొర్ర సీతారాం (35) గత కొంతకాలంగా పెరల్ స్ట్రోక్‌తో బాధపడుతూ విశాఖ కేజీహెచ్ ఈ నెల 8న సోమవారం మృతి చెందారు. గత సంవత్సరం సీతారాం భార్య దేవుడమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో వారి ముగ్గురు చిన్న పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. గిరిజన సంఘం నేత చిరంజీవి మంగళవారం సీతారాం మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన చంద్రన్న బీమా పథకం వల్ల 18 నుండి 60 ఏళ్ల వయసులోని కుటుంబ సభ్యులందరికీ బీమా ప్రయోజనం లభించేదని, అనారోగ్యంతో మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు 15 రోజుల్లో నామినీ ఖాతాలో జమ అయ్యేవని, మరణించిన వెంటనే వెలుగు సిబ్బంది ద్వారా రూ.5 వేలు తక్షణ సాయం అందించేవారని తెలిపారు. చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరించి, కొర్ర సీతారాం పిల్లలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, బురిడి నారాయణరావు, బురిడి రఘురామ్, కె.రాము, కె.సత్తిబాబు, సేవకులు జి.జానీబాబు, డేవిడ్ రాజు, పీసా కమిటీ నాయకులు జి.అప్పల సోమి, కె.రాజుబాబు, జి.విజయ్‌కుమార్, జి.చిరంజీవి, బి.రాజేష్, జి.కొత్తన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచుల ఫోరం నేతలు

అధికార దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- జి.మాడుగుల : మండలంలోని సొలభం పంచాయతీ వంజంగిపాడు క్లస్టర్ పీసా ఉపాధ్యక్షుడు లకే రామకృష్ణ తాను మండల ఫోరం పీసా అధ్యక్షుడు అని చెబుతూ గ్రామపంచాయతీలో సర్పంచ్ అనుమతి లేకుండా సచివాలయ రికార్డులను తనిఖీలు చేయడం, పాఠశాలలు అంగన్వాడీ సెంటర్లలో తనిఖీలు నిర్వహించడం, సచివాలయ సిబ్బందిని ఫోన్ ద్వారా బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనిమండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఐసరం హనుమంతరావు, ఉపాధ్యక్షులు పలాసి కృష్ణమూర్తి ఆరోపించారు. మంగళవారం స్థానిక సచివాలయంలో మండలంలోని 17 పంచాయతీల సర్పంచులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచ్ అధికారాలను హైజాక్ చేస్తూ అగౌరవపరుస్తున్నాడని,గతంలో ఇలాంటి చర్యలకు పూనుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి అప్పలరాజు, స్థానిక తహశీల్దార్,ఎంపిడిఒలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు,కార్యక్రమంలో 17 పంచాయతీల సర్పంచులు మండల నాయకులు పాల్గొన్నారు

రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి- చింతపల్లి : కూటమి ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తాజంగి సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన రైతులు ఒక్కొక్కరికి కేవలం 5 కిలోల రాజ్మా విత్తనాలు మాత్రమే ఇస్తున్నారని, అవి పంటకు సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక, ఇప్పటికే మొలకెత్తి పాడైపోయిన విత్తనాలు పంపిణీ చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా పురుగుమందులు బలవంతంగా ముట్టజెప్పుతున్నారని రైతులు ధనుంజయ్ దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయంలో పురుగుమందులు వాడకం ఉండదని, వాటిని బలవంతంగా ఇవ్వడం రైతులకు మోసగించడమేనని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీసా ప్రభాకర్, పిట్టల పోతురాజు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'హైడ్రో పవర్' పేరుతో అక్రమ నిర్మాణాలు దుర్మార్గం

- **నవయుగ కంపెనీపై అట్రాసిటీ కేసు పెట్టాలి**
- **జిల్లా ఎస్‌పికి ఆదివాసీ గిరిజన సంఘం నేతల ఫిర్యాదు**


ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - పాడేరు : హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో చిట్టంవలస, గుజ్జలిలో గిరిజన భూములలో సరిహద్దు దిమ్మలు నిర్మించిన నవయుగ కంపెనీ ప్రతినిధులు, ఇతర బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా ఎస్‌పి అమిత్‌బర్దర్‌ను కలిసిన ఆదివాసీ గిరిజన సంఘం నాయకులుఫిర్యాదు సమర్పించారు. నవయుగ కంపెనీపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో గిరిజన భూముల్లో గ్రామ సభల అనుమతి లేకుండా, పీసా, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిర్మించడం సరికాదన్నారు. గిరిజనుల జీవనోపాధిని, సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యావరణాన్ని ధ్వంసం చేసే ఇటువంటి దుర్మార్గమపు చర్యలు నియంత్రించాలని కోరారు. గిరిజనుల భూములను బలవంతంగా ఆక్రమించడం, హింస. అణచివేత ద్వారా వారి హక్కులను కాలరాస్తూ, బెదిరింపులు పాల్పడడం నేరమన్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, గిరిజన భూములను తిరిగి అప్పగించాలని, స్వతంత్ర్య సంస్థతో పారదర్శక విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు బాధిత గిరిజనులకు తగిన పరిహారం, పునరావాసం, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమం లో రాష్ట్రీయ ఆదివాసీ అధికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి డి. గంగరాజు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పీ. బాల్ దేవ్, టి.కృష్ణారావు, కిండంగి రామారావు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ కన్వీనర్ కృష్ణంరాజు, బొంజుబాబు స్థానిక ఎంపిటిసి ప్రజలు పాల్గొన్నారు.

'బెర్రీ బోరర్' నివారణపై అవగాహన




చింతపల్లిలో కాఫీ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -చింతపల్లి : కాఫీ సాగులో బెర్రీ బోరర్ పురుగుపూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తెలిపారు. రైతుల ఆర్థిక భద్రతను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. డాక్టర్ ఎన్.మధుమతి ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తల బందం చింతపల్లి మండలంలోని కాఫీ తోటలను సందర్శించింది. ప్రతి తోటలో పురుగు ప్రభావాన్ని అంచనా వేసి తక్షణ నివారణ చర్యలు వివరించారు.. పంటలో శుభ్రత, సమయానికి కొమ్మల తొలగింపు, సరైన సమయంలో పిచికారీ, ఉత్పత్తి తర్వాత మిగిలిపోయిన బెర్రీలను తొలగించడం కీలకమని తెలిపారుశాస్త్రీయ పద్ధతులను పాటించినప్పుడే కాఫీ పంటను రక్షించుకోవడం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రతి రైతు శ్రద్ధగా శాస్త్రీయ సిఫార్సులు అమలు చేస్తే ఈ పురుగును పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. కాఫీ పంటను కాపాడటమే కాకుండా, విదేశీ మార్కెట్లలో నాణ్యతతో నిలదొక్కుకునేందుకు ఈ చర్యలు కీలకమని వివరించారు.

హుకుంపేట: కాఫీ పైర్లను ఆశించి, తీవ్రంగా నష్టపరుస్తున్న బెర్రీ బోరర్ కీటక తెగులుపై రైతులంతా అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని సూకూరు పంచాయతీకాఫీ బెర్రీ బోరర్ పురుగు నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల తహశీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సుధాకర్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సన్యాసిరావు, ఉద్యాన అధికారి ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రైతులకు సరళమైన భాషలో సూచనలు అందించారు. సదస్సులో రైతులు సందేహాలను నివృత్తి చేశారు.

అనంతగిరి : బెర్రీ బోరర్ కీటకం ఆశించడంతో కాఫీ పంటలకు వాటిల్లే నష్టం, నివారణ చర్యలపై రైతులకు అవాహన కల్పించారు. మంగళవారం స్థానిక సచివాలయ కేంద్రంలో సర్పంచ్ సోమ్మెల. రూతు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎఒ రంగరావు, ఎపిఒ అర్జున్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాఫీ పైర్లను ఆశించే బెర్రీబోరర్ కీటక నివారణకు క్రిములు సోకిన కాయలను తొలగించి, వేడినీటిలో ఉడకబెట్టి, భూమిలో పాతిపెట్టాలని సూచించారు. అరకు, ముంచంగిపుట్టు మండలాల్లో ఈ కీటకం ఆశించి, కాఫీ పైర్లను తీవ్రంగా నష్టం చేస్తున్నాయనా్ౖర. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.20 వేల ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకరరావు, ఎవివి. కుమార్ తాహాశీల్దార్ వెంకటాచారి. హార్టికల్చర్ సిబ్బంది. సచివాలయం సెక్రటరీ దేవా పాల్గొన్నారు


అనంతగిరిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


హుకుంపేట : రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి సుధాకర్


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలంలో సొలభం పంచాయతీ కూడింగి గ్రామంలో పంచాయతీ నిధులతో 200 మీటర్లు డ్రైనేజీ కాలువను నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ ఐశ్వర్యం హనుమంతరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లకే, బాలయ్యదొర, వార్డు సభ్యుడు జి, సత్యనారాయణ, పీసా కమిటీ అధ్యక్షులు జి, అప్పలరాజు, ఆర్.కల్యాణ్, గ్రామస్తులు, అప్పలనాయుడు, కేశందొర, నీలకంఠం నాయుడు, మత్స్యరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చిన కోటిబాబు

ప్రజాశక్తి-హుకుంపేట: స్మార్ట్ రేషన్ కార్డుల కోసం మండలంలోని భీమవరం పంచాయతీ సచివాలయం వద వచ్చిన గిరిజనుల దాహార్తిని పీసా కమిటీ ఉపాధ్యాక్షుడు తూబురు కోటిబాబు తీర్చారు. మంగళవారం ఎండలో గంటల కొద్దీ స్మార్ట్‌కార్డుల కోసం వేచి ఉన్న గిరిజనులకు సచివాలయ వద్ద తాగునీటి సదుపాయం లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో తన ఇంటి నుంచి బిందెలతో తాగునీటిని తెచ్చి వారి దాహార్తిని తీర్చారు. భీమవరం, చిట్టంపాడు, గుమ్మడిగండువా, గంగరాజుపుట్టు, మద్దిపుట్టు, రామచంద్రపురం, ముంత మామిడి తదితర గ్రామాల ప్రజలు స్మార్ట్ రేషన్ కార్డుల కోసం భీమవరం సచివాలయం వద్దకు వచ్చారు. సచివాలయం వద్ద శాశ్వత తాగునీటి సదుపాయం కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని కోటిబాబు కోరారు. ప్రజల దాహార్తిని తీర్చడం ఆనందంగా ఉందన్నారు.

వీధి కుక్కలపై అప్రమత్తత

ప్రజాశక్తి -హుకుంపేట: వీధి కుక్కలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ కె.చరణ్ సూచించారు. ఇదే సమయంలో వీధి కుక్కలను హింసించడం, హతమార్చడం చట్టరీత్యా క్రిమినల్ నేరమని స్పష్టం చేశారు..భారత జంతు హింస నిరోధక చట్టం1960 ప్రకారం బాధ్యులకు జరిమానా, జైలుశిక్ష లేదా రెండూ విధిస్తారన్నారు. జంతువులపై హింస మానవత్వానికి విరుద్ధమని, ఇలాంటి సంఘటనలు గమనించిన వెంటనే ఎంపిడిఒ, పశువైద్యాధికారి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాడేరు మండలంలో కొంతమంది వీధి కుక్కలను హింసించి హతమారుస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఎవరైనా బాధ్యత వహించి, వీధికుక్కలను ఆసుపత్రికి తీసుకొస్తే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేస్తామన్నారు.

కుండపోత వర్షం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ::మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో కుండ పోత వర్షం కురిసింది. ఈ వర్షంతో మండల కేంద్రంలోని వీధి కాల్వలు, రోడ్లు వర్షపు నీటితో నిండి జలమయంగా మారాయి. పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం గెడ్డ పొంగి ప్రవహించింది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రకానికి వచ్చిన మారుమూల ప్రాంత ప్రజలు, తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడ్డారు.

గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని గోమంగి మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెలరోజుల పాటు గ్రామ సభలు నిర్వహించేందుకు అనుమతి కోరుతూ సాధన సమితి నాయకులు స్థానిక ఎస్ఐ కె.రమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పెదబయలు జడ్పిటిసి సభ్యులు కూడ బొంజుబాబు, సాధన సమితి కార్యదర్శి పృధ్వీరాజ్, నాయకులు కొమ్మ అనంత పద్మనాభం, కొమ్మ బాలరాజ్, పాంగి సింహాచలం, కుంబిడి మేఘరాజ్, కే నవీన, రాసగుల్ల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రంగారెడ్డి

'వైసిపి నాయకులు వాస్తవాలు మాట్లాడాలి'

ప్రజాశక్తి- విఆర్‌పురం: వైసిపి నాయకులు వాస్తవాలు మాట్లాడాలని జెడ్‌పిటిసి రంగారెడ్డి హితవు పలికారు. మండలంలోని రేకపల్లి గ్రామంలో మంగళవారం టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటించిన సందర్భంగా కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు అందించడంలో విఫలమైందని మాట్లాడారని, అసలు గత ప్రభుత్వ హయాంలో ఎంత దారుణంగా వరదలు వచ్చాయో మీరంతా ఎంత బాగా సేవలందించారో ప్రజలకి తెలుసు అని ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ అమలు జరగడం లేదని అనంతబాబు ధనలక్ష్మి విమర్శించారు. మరి వైసిపి కార్యకర్తల బ్యాంక్ అకౌంట్లు ఒకసారి చెక్ చేసుకుని మాట్లాడాలి అని చురకలంటించారు. ఇప్పటికే యూరియా విఆర్‌పురం మండలానికి 32 టన్నులు వచ్చింది దాన్ని రైతులకు అందించామని, వచ్చే వారంలో మరో 40 టన్నులు వస్తుందన్నారు. పోలవరం నిర్వాసితులకు గతంలో రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, మాజీ అధ్యక్షుడు బొర్రా నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంతకీ ఆ కాగితాలేంటి?

ప్రజాశక్తి- జికెవీధి :మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళ వారం రహస్యంగా కొన్ని కాగితాలను తగులబెట్టారు. గూడెం కొత్త వీధి ఎంపిడిఒ కార్యాలయ భవనంలో లోపల నుంచి ఒకరు అందిస్తుంటే బయట మరొకరు వాటిని తగులబెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ, విద్యాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. మరి రహస్యంగా వాటిని మంటల పాలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పనికిరాని కాగితాలైతే వెనుక ద్వారంవైపు ఎందుకు తగులబెట్టాల్సి వచ్చిందని పలువురు చర్చించుకుంటున్నారు.


తగులబెడుతున్న కాగితాలు



అవగాహన కల్పిస్తున్న ఎఒ గిరిబాబు

కొత్తపాలెంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - జికెవీధి : మండలంలోని వంచల పంచాయతీ కొత్తపాలెంలో వ్యవసాయాధికారి గిరిబాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ గిరిబాబు మాట్లాడుతూ కొత్తపాలెంలో ప్రధానంగా వరి, వేరుశనగను రైతులు అధికంగా పండిస్తున్నారని వరిలో వచ్చే తెల్లదోమ, కాండం తెగులుపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగలో అధిక దిగుబడి రావటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ


దుంబ్రిగుడ: కొర్రాయిలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న నేతలు


విఆర్‌పురం: రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలం బూదరాళ్ల పంచాయితీ బూదరాళ్లలో స్మార్ట్ రేషన్‌కార్డులు సర్పంచ్ ముత్యాలమ్మ పంపిణీ చేశారు. వార్డు మెంబర్ సంజీవ్, బూదరాళ్ల విఆర్ఒ గంగాధర్, సేల్స్‌ఉమెన్ విజయకుమారి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జికెవీధి: మండలంలో జికె వీధి పంచాయతీ ఉపాధ్యక్షులు నర్సింగరావు, విఆర్ఒ ఆధ్వర్యంలో పి.అగ్రహారంలో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. గ్రామ పీసా కార్యదర్శి కె.అనిల్‌కుమార్, రేషన్‌డీలర్ వెంకటేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి, వడ్డిగూడెం, శ్రీరామ్‌గిరి, ములకనపల్లిలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనం సరోజిని, శ్రీరామ్‌గిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, సవల మారయ్య స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు కారం సుందరయ్య, పోడియం శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీలో మంగళవారం స్థానిక సర్పంచ్ పి.కొమ్ములు, వైస్ ఎంపిపి లలిత రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగన్నాథం కూటమి నాయకులు కె.లక్ష్మణ్ రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోన కొమ్మంగి పంచాయతీ పరిధి రింతాడ గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను జనసేన నాయకులు పోటుకూరి జయరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రేషన్ సరుకులు పొందడంలో ఎదురైన ఇబ్బందులు స్మార్ట్ కార్డుల ద్వారా తొలగిపోతాయని తెలిపారు.

కలెక్టర్ దినేష్ కుమార్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి -అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో కలెక్టర్ దినేష్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు పర్యటనలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద కొబ్బరి మొక్క నాటారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వచ్చిన రోగులకు వెంటనే వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న పరికరాలు మరమ్మతుకు గురయ్యాయని డాక్టర్ సతీష్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి పరికరాలకు ఫోటోలు తీసి సంబంధిత అధికారులకు తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఎంతమంది గర్భిణులు ఉన్నారు వారికి పౌష్టికాహారం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని జ్వరం కేసులు నమోదయ్యాయి స్కానింగ్ ఆపరేటర్ ఉన్నది లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, డిఎంహెచ్ఒ విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, డాక్టర్ సతీష్, తహశీల్దార్ దొరకయ్య, ఎంపిడిఒ రాజావిజయ, సహాయక గిరిజ న సంక్షేమ శాఖాధికారి కృష్ణమోహన్, సిడిపిఒ క్రాంతి పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

'అన్నదాత పోరు' నిరసనలో ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు



పాడేరులో వైసిపి నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు/ పాడేంరు టౌన్ : ఎరువులు సకాలంలో పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆరోపించారు. మంగళవారం పాడేరులో వైసిపి పిలుపు మేరకు అన్నదాత పోరు' పేరుతో అరకు, పాడేరు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, రైతు సంఘాలు నిరసన చేపట్టాయి. స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయం నుంచి రైతులకు గిట్టుబాటు ధర, యూరియా, విత్తనాలు అందించాలని నినాదాలు చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఎఒ అప్పలస్వామిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్ పాల్గొన్నారు.



చింతూరులో ఐటిడిఎ కార్యాలయం వద్ద వైసిపి నాయకుల నిరసన

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం చింతూరు మండలం చింతూరులో కూటమి ప్రభుత్వం రైతన్నకు చేసిన మోసాలు, రాష్ట్రంలో ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు ఈ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వైసిపి ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ ఎపిఒకి ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చింతూరు, కూనవరం, విఆర్‌పురం, ఎటపాక, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, జిల్లా బిసి అధ్యక్షులు, సర్పంచులు, వైస్ సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

'బాలల సంరక్షణ చట్టాలను అమలు చేయాలి'

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : బాలల సంరక్షణ, పునరావాస చట్టాలను సక్రమంగా అమలు జరిగేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి చిన్నంశెట్టిరాజు అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బాలల న్యాయ, రక్షణ చట్టాల అమలులో కీలకమైన సమస్యలు, సవాళ్లపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. బాలల సంరక్షణ, పునరావాసం కోసం ఉన్న చట్టాలను జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) పోక్సో చట్టం వంటి వాటిని ఎలా సమర్ధంగా అమలు చేయాలి అనే దానిపై చర్చించారు. కార్యక్రమంలో పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి మంగా కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి వరలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఎడి రమేష్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: సమాచారపౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణంలోని ఎస్ఐసి. (స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్) ఎడిగా పని చేస్తున్న దున్న రమేష్‌కు డిడిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ముకేశ్‌కుమార్‌మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ఎడిగా పనిచేసిన రమేష్ జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖలోని ఎస్ఐసికి వచ్చి సుమారు 3 నెలల పాటు సేవలందించారు. తాజాగా జరిగిన డిపిసిలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఎడిలు పదోన్నతి పొందగా అందులో జోన్-1 నుంచి పి.వెంకటరాజుగౌడ్, ఎల్. రమేశ్‌తో పాటు దున్న రమేష్ ఉన్నారు. ఈ మేరకు విజయవాడలోని డైరెక్టరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

'నగరాభివృద్ధిపై దృష్టి సారించండి'

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : నగరాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ 4వజోనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 4వజోన్ జోనల్ కార్యాలయంలో జోనల్‌స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ జోన్ పరిధిలో ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి, ఏ స్థాయిలో ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభించని గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి ధరావత్తు సొమ్మును జివిఎంసికి జమ చేయాలన్నారు. తాగునీరు సరఫరా, విద్యుత్ దీపాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ పనులు, సోలార్, విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై సమీక్షించారు. అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సి సర్టిఫికేట్ జారీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నుల వసూలు వేగవంతం చేయాలని, పారిశుధ్య పనులు పక్కాగా చేయాలన్నారు.

పిపిపి లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలి

- పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి లక్ష్మి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలలలో పదింటిని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడాన్ని రద్దు చేయాలని, మంగళవారం పిడిఎస్ఒ ఆధ్వర్యంలో రామ్‌నగర్ ఎన్ఆర్ఐ కాలేజీ వద్ద నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టి అనంతరం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి, ఓబిసి రిజర్వేషన్ కోటాను 50 శాతం తగ్గించి, 50 శాతం సీట్లను మార్కెట్ రేట్లతో విక్రయించడం వల్ల ఫీజులు అమాంతంగా పెరుగుతాయన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తైన 10 కళాశాలల్లో ఎంబిబిఎస్ సీట్లను రద్దు చేయమని ఎన్ఎంసికి లేఖ రాసిందన్నారు. ఇది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆరోపించారు. 17 కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే లాభాలు

- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయిస్తే, లాభాలబాట పడుతుందని కేంద్ర మాజీ మంత్రి, పిసిసి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి కృపారాణి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతర దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేట్ కంపెనీలకు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన బిజెపి ప్రభుత్వం వేల కోట్లు స్టీల్‌ప్లాంట్ రుణాన్ని మాఫీ చేయలేరా? అని ప్రశ్నించారు. ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నక్కపల్లిలో మిట్టల్‌స్టీల్ కంపెనీకి, ఉచితంగా అన్ని సదుపాయాలు కల్పిస్తుండడంపై ఆమె మండిపడ్డారు.